# 30. పక్షపాతం

విద్యార్థులుగా ఉన్నప్పుడు మంచి మిత్రులైన ఇద్దరిలో ఒకరు ముక్తి కాంక్షతో హిమాలయాలకి వెళ్ళిపోయాడు. మరొకరు ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డాడు. దాదాపు పన్నెండేళ్ళ తర్వాత, హిమాలయాలకి వెళ్ళిన సన్యాసి తన మిత్రుడి స్వగ్రామం వచ్చాడు. ఉపాధ్యాయుడైన పాత మిత్రుడి వద్దకి వెళ్ళి ఆ రాత్రి వారింట్లోనే బస చేసాడు.

మాటల్లో ఉపాధ్యాయ మిత్రుడు అడిగాడు.

"మిత్రమా! నాదొక సందేహం. మనమంతా ఆ దేవుడి బిడ్డలమే కదా? మరి అయనకి తన బిడ్డలమీద ఎందుకింత పక్షపాతం?"

"ఏం పక్షపాతం?" అడిగాడు సన్యాసి మిత్రుడు.

"కొందరు పుట్టుగుడ్డిగా, కొందరు అంగ వైకల్యంతో, మరికొందరు చెవిటి వాళ్ళుగా పుడుతున్నారు. ఒకరు మహారాజుకి జన్మిస్తే, ఇంకొకడు భిక్షగాడికి జన్మిస్తున్నాడు. కొందరు సుఖంగా ప్రాణం వదిలితే, ఇంకొందరు దీర్ఘరోగాన్ని అనుభవించి ప్రాణం విడుస్తున్నారు. దీనికంతటికీ కారణమైన ఆ దేవుడు పక్షపాతి కాకపోతే మరేమిటి?"

సన్యాసి నవ్వి ఊరుకున్నాడు. మర్నాటి ఉదయం ఉపాధ్యాయుడి దగ్గరకి పాఠాలు నేర్చుకోవడానికి శిష్యులు వచ్చి వెళ్ళాక అడిగాడు సన్యాసి.

"నీ శిష్యులందరినీ నువ్వు ఒక్కలా చూడకుండా పక్షపాతంతో చూస్తున్నావెందుకు?"

"లేదే? నాకంతా ఒకటేనే?"

"అలాగైతే, మరి వాళ్ళల్లో కొందర్ని కొట్టావు. కొందరి చేత గోడకుర్చీ వేయించావు. ఇంకొందర్ని మెచ్చుకున్నావు కదా?"

"అదా! ఇంటి దగ్గర చదువుకురాని వాళ్ళని శిక్షించాను. చదివిన వాళ్ళని మెచ్చుకున్నాను. అంతా వారి బాగుకే తప్ప నాకెలాంటి పక్షపాతం లేదు." చెప్పాడు ఉపాధ్యాయ మిత్రుడు.

"నిన్నటి నీ ప్రశ్నకి జవాబు కూడా ఇదే. భగవంతుడికి కూడా నీలా ఎవరి మీదా పక్షపాతం లేదు. కిందటి జన్మల్లో కొందరు చెడ్డ పనులు చేయబట్టి వాళ్ళకంటిన పాపం వదిలించడానికి అనారోగ్యం, దారిద్ర్యం లాంటివి ఇచ్చాడు. మంచి పనులు చేసిన వారికి పుణ్యఫలంగా ఐశ్వర్యం, ఆరోగ్యం ఇచ్చాడు. ఎవరి కర్మకి వాళ్ళే బాధ్యులు"

## 31. గురు పాదాల విలువ

భారతదేశం నించి అమెరికాకి వచ్చిన ఓ స్వామీజీకి, ఓ నది ఒడ్డున గల ఆశ్రమానికి, హిందూ మతంపై ఆసక్తి గల ఓ అమెరికన్ వెళ్ళి, వాళ్ళ లైబ్రరీ నించి హిందూ మతం గురించిన ఎన్నో పుస్తకాలు తీసుకెళ్ళి చదివాడు.

ఆ పుస్తకాలని తిరిగి ఇచ్చేసాక స్వామీజీతో చెప్పాడు.

"హిందూ మతంలో నాకంతా నచ్చింది, ఒక్కటి తప్ప."

"ఏమిటది? అందులో నీకేం లోపం కనబడింది?" అడిగాడాయన.

"పాద నమస్కారాలు. శిష్యులు గురువుగారి పాదాలనాశ్రయించడం. పాదాలు శరీరంలో అధమస్థానంలో ఉంటాయి. మనం బాత్‌రూంలోకి వెళ్ళినప్పుడు తప్పనిసరిగా పాదాలు కడుగుతాం. శరీరంలో బురద, మురికి, మట్టి లాంటివి అధికంగా అంటేది పాదాలకే. అలాంటి పాదాలకి ఓ పవిత్ర స్థానం ఇవ్వడం నాకు నచ్చలేదు. గురువు శరీరంలోని ఏదో ఓ అవయవం మీద గౌరవాన్ని ప్రదర్శించాలనుకున్నప్పుడు, అది ఉన్నత స్థాయిలోని శిరస్సు పట్ల ప్రదర్శిస్తే బావుండేదనిపిస్తోంది. గురువు కాలి బొటనవేళ్ళ నించి గంగా యమునలు ప్రవహిస్తుంటాయని, ఆ నీటిని శిష్యుడు తల మీద చల్లుకుంటే